



కలెక్టకరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న అఖిలపక్ష నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న గ్రంథాలయ చైర్‌పర్సన్ ఉషారాణి

విజ్ఞానానికి కేంద్ర బిందువులు గ్రంథాలయాలు

- చైర్‌పర్సన్ లింగాల ఉషారాణి

ప్రజాశక్తి -కడప అర్బన్

విజ్ఞానానికి కేంద్ర బిందువులు గ్రంథాలయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఉషరాణి పేర్కొన్నారు. సోమవారం జిల్లా గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో 33 రోజులు పాటు నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభించారు. ముందుగా గ్రంథాలయ స్వాతంత్ర్య సమర యోధుల నాయకులు పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరి సర్వోత్తమ రావు ఫోటోలకు పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగే ఈ సారి కూడా వేసవి శిబిరాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. శిబిరం వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత శక్తిని వెలికి తీయొచ్చన్నారు. పిల్లలందరూ ఉపయోగించుకోవాలని కోరారు. జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి అంబవరం ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ చదువుతోపాటు సంస్కారం కూడా పిల్లలు అలవర్చుకోవాలని పేర్కొన్నారు ప్రతి విద్యార్థి నాలుగు లక్షణాలు కలిగి ఉండడం అవసరమని చెప్పారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదవడం, కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉండడం, తల్లిదండ్రులు, గురువులు పట్ల గౌరవాన్ని కలిగి ఉండడం, సమాజంలో జరిగే విషయాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవడం చేయాలన్నారు. జెవివి రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ నిత్య జీవితంలో సైన్సు ఒక భాగం అయిందని తెలిపారు. సమాజంలో నెలకొన్న మూఢనమ్మకాల నుంచి బయట పడడానికి వేసవి శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాగేంద్ర ప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ డిప్యూటీ లైబ్రరీ పవన్ కుమార్, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-పోరుమామిళ్ల

విద్యార్థులు వేసవి సెలవులలో పుస్తక పఠనం అలవర్చుకోవాలని పంచాయతీ పాలనాధికారి సుబ్బారెడ్డి, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గ సభ్యులు ఇన్నయ్య, మహమ్మద్ యాసీన్ రచయిత బొల్లు రామ్మోహన్ పిలుపునిచ్చారు. సోమవారం పోరుమామిళ్లలోని గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి అఫ్రిది ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని వారు ప్రారంభించారు . ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖ ఈ కార్యక్రమాన్ని ఈనెల 8 నుంచి జూన్ 11 వరకు నిర్వహిస్తోందన్నారు. విద్యార్థులు రోజూ గ్రంథాలయానికి వచ్చి కథల పుస్తకాలు, మహానుభావుల జీవిత చరిత్రలు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించి విజేతలకు జూన్ 11న బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాష, ఖాసింవల్లి, ఖదీర్ బాష, ఖాజావలి, రంగనాయకులు విసీల్ పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - కడప

రెడ్ క్రాస్ ఒక అంతర్జాతీయ సంస్థ అని వైసిపి కడప నియోజకవర్గ నాయకులు అఫ్జల్‌ఖాన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక రెడ్‌క్రాస్ భవనంలో ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా హెన్రీ డునంట్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ 1863వ సంవత్సరంలో రూపుదిద్దుకుందని తెలిపారు. ఈ సంస్థ ద్వారా అంతర్జాతీయంగా ప్రమాదాలోనూ, మహమ్మారీ వ్యాధుల బారిన పడిన సమయంలోనూ బాధితుల ప్రణాలను కాపాడే మానవతా సేవ అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా స్టెప్ అధికారి సాయి గ్రేస్, రెడ్ క్రాస్ సీనియర్ సభ్యులు రాయల్ కరీముల్లా, జె. కె యూత్ అధ్యక్షులు ఖాదర్ బాషా,రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-కాశినాయన

మండల కేంద్రంలోని నరసాపురం ఎపి మోడల్ పాఠశాలలో 2023-24 ఆరో తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సౌజన్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 9 నుంచి 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూన్ 11న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. పరీక్ష రుసుం ఎస్‌సి, ఎస్‌టిలు రూ.75, ఒసి, బిసిలు రూ.150 చెల్లించాలని తెలిపారు. పాఠశాలలో ఇంటర్‌వరకు ఆంగ్లంలో విద్యాబోధన ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9010793182లో సంప్రదించాలన్నారు.

ప్రజా సేవే ఎన్‌ఎస్‌ఎస్ లక్ష్యం

ప్రజాశక్తి- కడప అర్బన్



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

ప్రజాసేవే ఎన్ఎస్ఎస్ విద్యార్థుల లక్ష్యమని కెఎస్ఆర్ఎం ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఎస్.ఎస్. మూర్తి అన్నారు. ఆదివారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు ఏడు రోజులపాటు ప్రత్యేక శిబిరాన్ని కొప్పర్తిలో ప్రారంభించారు. ఈ ప్రత్యేక శిబిరం ద్వారా గ్రామస్తులతో కలిసి విద్యా, వైద్యం, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. నీటిని పొదుపు చేయడం, అంటు వ్యాధుల నివారణ, ప్లాస్టిక్ వాడకంపై కలిగే అనర్థాలను, బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించటం, వారి తల్లిదండ్రులకు ఉన్నత విద్యపై అవగాహన కల్పించడం చేశారు. ప్రత్యేక శిబిరం ద్వారా స్కూల్ ఆవరణలో పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి స్పందిస్తూ ఇలాంటి అవగాహన శిబిరాలను నిర్వహించడం పట్ల, ప్రజలను చైతన్య పరచి, గ్రామాలు అభివృద్ధి దిశలో ముందుకు పోవచ్చునని తెలిపారు. ఆనంతరం కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జె సురేష్ బాబు, విద్యార్థులను అభినందించారు.

19న జడ్‌పి సర్వసభ్య సమావేశం

కడప అర్బన్ : జడ్‌పి సర్వసభ్య సమావేశం ఈనెల 19 నిర్వహిస్తున్నట్లు జడ్‌పి సిఇఒ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు సమావేశం ప్రారంభ మవుతుందని తెలిపారు. జడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు శాశ్వత ఆహ్వానితులు, అధికారులు హాజరుకావాలని పేర్కొన్నారు.

డిగ్రీ కళాశాలలు ప్రాజెక్టు రిపోర్ట్‌లు సమర్పించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

వైవీయూ పరిధిలోని డిగ్రీ మూడవ సెమిస్టర్‌కు సంబంధించి కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు మార్కులు ఆన్‌లైన్‌లో ఈనెల 9న సాయంత్రం ఐదు గంటలకు సమర్పించాలని డిగ్రీ కళాశాలల ప్రధానాచార్యులకు వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్. ఈశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మార్కులు ఆన్‌లైన్‌లో సమర్పించకపోతే సంబంధిత విద్యార్థులు కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టుకు గైర్హాజరైనట్లు భావించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ నెల 10న డిగ్రీ మొదటి, మూడవ సెమిస్టర్ల ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు.

కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలం

ప్రజాశక్తి- కడప అర్బన్



నిరసనలో మాట్లాడుతున్న రాష్ట్ర కన్వీనర్ వెంకటసుబ్బయ్య

గవర్నమెంట్ జనల్ హాస్పిటల్ (జిజిహెచ్)లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపి మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ పి. వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆస్పత్రి ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు జీవో నంబర్ 549 ప్రకారం రూ.16,000 ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా చెల్లించాలని పేర్కొన్నారు. అగ్రిమెంట్ ప్రకారం డ్యూటీలు వేయాలని చెప్పారు. శానిటేషన్ కార్మికుల పట్ల సూపర్‌వైజర్ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. అగ్రిమెంట్ ప్రకారం పది మంచాలకు ఒక కార్మికుని కేటాయించాలని తెలిపారు. హాస్పిటల్ లోపల పనిచేసే వారితోనే బయట రోడ్లు కూడా ఊడిపిస్తున్నారని పేర్కొన్నారు. క్యాజువల్ లీవ్స్, పండగ సెలవులు ఇంతవరకు ఇవ్వలేదన్నారు. వారి అగ్రిమెంట్ ప్రకారం కార్మికులకు ఏమేమి సౌకర్యాలు అందిస్తామన్నారో అవన్నీ సమకూర్చే బాధ్యత కాంట్రాక్టర్ దే అన్నారు. సెక్యూరిటీ కార్మికులు దాదాపు 160 మంది జిజిహెచ్‌లో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎక్స్‌పర్ట్ కంపెనీ వారు నిర్వహణ చూస్తున్నారని చెప్పారు. దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్నా ఒక్క జత మాత్రమే యూనిఫామ్ ఇచ్చి చేతులు దులుపుకున్నారని, అగ్రిమెంట్లో సంవత్సరానికి రెండు జతలు యూనిఫామ్ ఇస్తామని, పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా చెల్లిస్తామని, గవర్నమెంట్ ప్రతిపాదన ప్రకారం కనీస వేతనం అమలు చేస్తామని అగ్రిమెంట్‌లో పొందుపరిచారని చెప్పారు. కానీ దానికి భిన్నంగా జిజిహెచ్‌లో కాంట్రాక్టర్ వ్యవహరిస్తున్నాడని విమర్శించారు. సెక్యూరిటీ కార్మికులతో మట్టి పని, శానిటేషన్ పని, చెట్ల నరకడం పని ఇలాంటి పనులన్నీ చేయిస్తున్నారని తెలిపారు. చేయమని చెప్పిన కార్మికులను విధులకు రావద్దని బెదిరిస్తున్నాడని వాపోయారు. ఇలాంటి పద్ధతులు మానుకోవాలని కాంట్రాక్టర్లను కోరారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు పి.చంద్రా రెడ్డి, రిమ్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.వి.సుదర్శన్, యూనియన్ కార్యదర్శులు ఏసన్న, కొండయ్య, సురేష్ కుమార్, కమిటీ సభ్యులు పి.పవన్, అన్నమ్మ, పెంచలమ్మ, విజయ, రామచంద్రుడు, జిజిహెచ్ శానిటేషన్ సెక్యూరిటీ కార్మికులు పాల్గొన్నారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్ల అరెస్టు



నిందితులను హాజరు పరిచి వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి అన్బురాజన్

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో లోన్ యాప్ వేధింపులకు పాల్పడిన ఇద్దరు అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసినట్లు ఎస్‌పి అన్బురాజన్ తెలిపారు. సోమవారం డిపిఒలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కల్పన ఆన్‌లైన్‌లో తీసుకున్న రుణానికి అధిక మొత్తంలో వడ్డీ వసూలు చేసి యాప్ నిర్వాహకులు వేధిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. లోన్ మొత్తం కట్టకపోతే ఫొటోలను మార్ఫింగ్ చేసి అశ్లీలంగా కుటుంబ సభ్యులకు, బంధువులకు పోస్టులు పెడతామని వేధింపులకు గురి చేసినట్లు చెప్పారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు పేర్కొన్నారు. రాజంపేట చెందిన పైడి వెంకట ప్రణయ్ స్నేహిత్ తోపాటు, బెంగళూరుకు చెందిన ఇమ్రాన్ ఖాన్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. 70 అనుమానిత బ్యాంక్ అకౌంట్లు సీజ్ చేశామని చెప్పారు. రూ.కోటికి పైగా లావాదేవీలు చేసినట్లు నిర్ధారణకు వచ్చామని పేర్కొన్నారు. డేటా బేస్ ఆధారంగా నాలుగు రాష్ట్రాల్లో కేసు నమోదు చేశారని తెలిపారు. ఇతరులకు బ్యాంకు, పాన్ వివరాలు చెప్పవద్దని కోరారు. నకిలీ లోన్ యాప్ బారిన పడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. బాధితులు వెంటనే ఎన్‌సిఆర్‌పి పోర్టల్ లో ఫిర్యాదు చేసేందుకు 1930 టోల్ ఫ్రీ నంబర్ కు కాల్ చేయాలని తెలిపారు. పోర్టల్ నుంచి ఫిర్యాదు మాకు వస్తుందని, విచారణ చేసి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. అంతర్ రాష్ట్ర సైబర్ నేరగాళ్ళను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన ఫ్యాక్షన్ జోన్ డిఎస్‌పి జి. చెంచుబాబు, కడప డిఎస్‌పి ఎం.డి షరీఫ్, ఒంటిమిట్ట సిఐ పురుషోత్తం రాజు, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ నాయుడు, ఒంటిమిట్ట ఎస్.ఐ మధుసూదన్ రావు, సైబర్ క్రైమ్ ఎస్‌ఐలు మధు మల్లేశ్వర రెడ్డి, రవి కుమార్, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.

పసుపు కొనుగోలులో నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె



ఎఒకు వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

పసుపు కొనుగోలులో ప్రభుత్వం నిర్లక్ష్యం తగదని, దీని వల్ల రైతులు మద్దతు ధరలు కోల్పోతున్నారని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. దస్తగిరిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొలుములపల్లె రైతు భరోసా కేంద్రం వద్ద రైతులతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం ఎఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దస్తగిరిరెడ్డి మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలలో పసుపు పంటను సాగు చేశారని, పంట చేతికొచ్చిందని రైతులు ఆర్‌బికెలలో విక్రయించేందుకు రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారని చెప్పారు. ఇంతవరకూ మార్క్‌ఫెడ్ అధికారులు ఎప్పుడు కొనుగోలు చేస్తారో ప్రభుత్వం ప్రకటించకపోవడం దారుణమని వాపోయారు. దీంతో రైతులు బహిరంగ మార్కెట్‌లో ప్రయివేట్ వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయిస్తున్నారని తెలిపారు. ఫలితంగా ప్రభుత్వం ప్రకటించిన రూ.6850 మద్దతు ధరను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు ఖర్చులు పెరిగిన నేపథ్యంలో తక్కువ ధరకు క్వింటా రూ. 4,800 నుంచి రూ.5,200 వరకు విక్రయించి నష్టపోతున్నారని తెలిపారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నాణ్యత తగ్గిందనే సాకుతో వ్యాపాకులు తక్కువ రేటు అడుగుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మద్దతు ధరకు పసుపు కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం పెరిగిన సాగు ఖర్చుల ఆధారంగా క్వింటా రూ. 10 వేలు పెంచాలని మార్కెట్ యార్డుల ద్వారా పసుపు కొనుగోలు చేయాలని డిమాండ్‌తో రానున్న కాలంలో ఆందోళన పోరాటాలకు శ్రీకారం చుడతామని ఆయన హెచ్చరించారు. నిరసనలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, మండల అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, చక్రవర్తి, సుబ్బారెడ్డి,బాబయ్య,సిద్దయ్య, ఓబుల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లక్ష్యాన్ని అధిగమించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణ పనుల లక్ష్యాన్ని ప్రణాలికాబద్ధంగా అధిగమించాలని కలెక్టర్ వి. విజయ్ రామరాజు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సభాభవన్‌లో జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణ పనుల పురోగతిపై ఆర్డీవోలు, నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా రూపుదిద్దుకుంటున్న జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహనిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. నిర్మాణ పనులను లక్ష్యం మేరకు పూర్తి చేసేందుకు సంబంధిత శాఖలతో సమన్వయంతో పనిచేయాలన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించాలని, వెనకబడితే చర్యలు తప్పవని అన్నారు. సమావేశంలో కలెక్టర్ తోపాటు జెసి గణేష్ కుమార్, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్ఒ గంగాధర్ గౌడ్, హౌసింగ్ పీడీ కృష్ణయ్య అన్ని రెవెన్యు డివిజన్ల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

సంక్షేమ కేలండర్ ఆవిష్కరణ

కడప : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల కేలండర్‌ను సోమవారం కలెక్టరేట్ లోని సభా భవన్ ః లో జిల్లా కలెక్టర్ వి విజయ్ రామరాజు ఆవిష్కరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అమలు చేసే సంక్షేమ పథకాలకు సంబంధించి వివరాలన్నీ కేలండర్‌లో పొందుపరచడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంక్షేమ క్యాలెండర్ ఆవిష్కరణలో జెసి గణేష్ కుమార్, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్ఓ గంగాధర్ గౌడ్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి పి.వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రలో లక్ష్మీరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్



లోకేష్‌ను కలిసిన లక్ష్మిరెడ్డి కుటుంబ సభ్యులు

కర్నూల్‌లో నిర్వహిస్తున్న లోకేష్ యువ గళం పాద యాత్రలో సోమవారం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఆలంకాన్‌పల్లి లక్ష్మీరెడ్డి, 49వ డివిజన్ కార్పొరేటర్ ఉమా దేవి, టిడిపి నాయకులు మన్మోహన్ రెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాదయాత్రలో ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజలకు వివరిస్తూ, బిసిలకు చేసిన అన్యాయాన్ని ఎత్తిచూపుతో పాదయాత్ర ముందు సాగిందన్నారు. మళ్లీ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే బిసిలకు జరిగిన అన్యాయాన్ని నిర్మూలిస్తామన్నారు. ఈ పాదయాత్ర ద్వారా ప్రజలకు మంచి సందేశం లోకేష్ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జయరాం రెడ్డి, శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

సిఐ, ఎస్‌ఐలపై కేసు నమోదు చేయాలి

- అఖిలపక్ష నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఐఎఎల్ జిల్లా అధ్యక్షులు సి. సుబ్రమణ్యం, సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు పి.చంద్రశేఖర్, ఇన్సాఫ్ నగర కార్యదర్శి ఎస్.కె. మైనుద్దీన్‌పై దాడి చేసి కులం, మతం పేరుతో దూషించిన కడప తాలూక సిఐ ఉలసయ్య, ఎస్‌ఐలు రామక్రిష్ణ, తాహిర్ హుస్సేన్‌పై కేసు నమోదు చేసి, సస్పెండ్ చేసే వరకు పోరాటం చేస్తామని అఖిలపక్ష నాయకులు హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట అఖిలపక్ష నేతలు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత నెల 29న సిపిఐ, సిపిఎం దేశవ్యాప్త ప్రచారభేరిలో భాగంగా ఐటిఐ కూడలిలో శాంతియుతంగా సభ నిర్వహించేందుకు వచ్చిన సిపిఐ, సిపిఎం నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచక్షణారహితంగా కొట్టి అసభ్య పదజాలంతో ధూషించారని చెప్పారు. సిఐ, ఎస్‌ఐలపై చర్యలు తీసుకునేంత వరకు ఆందోళన చేస్తూనే ఉంటామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, టిడిపి నాయకులు బి. హరిప్రసాద్, అమీర్ బాబు, లక్ష్మిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎస్.ఎ. సత్తార్, సిపిఎం నగర కార్యదర్శి రామ్మోహన్, నాయకులు అన్వేష్, ఓబులేసు, బిసి మహాసభ ఆవారు మల్లికార్జున, సి.ఆర్. వి. ప్రసాద్ రావు, ఎన్ వెంకట శివ, లోక్ సత్తా కృష్ణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణమూర్తి, ఎల్ నాగ సుబ్బారెడ్డి, కేసీబాదుల్లా, ఓబయ్య, మనోహర్ రెడ్డి, మద్దిలేటి, మల్లికార్జున, పిడుగు మస్తాన్, వలరాజు, భాగ్యలక్ష్మి, మైనుద్దీన్, కేశవ, నారాయణ, పకీరప్ప పాల్గొన్నారు.

అర్జీలకు తక్షణ పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

స్పందన ద్వారా వచ్చిన అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలని అన్ని శాఖల అధికారులను కలెక్టర్ విజయ్‌రామరాజు ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సిపివెంకట రావు, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు, జిజిహెచ్ సూపర్ ఇన్ టెన్ డెంట్ డా.వెంకటేశ్వరరావు, పంచాయతీ రాజ్ ఎస్ఇ శ్రీనివాస రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'లా' విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

జిల్లాలో లా కళాశాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాలశివకుమార్ కోరారు. సోమవారం యోగివేమన యునివర్సిటీ లో రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ ఈశ్వర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలోని లా కళాశాల విద్యార్థులకు యూనివర్సిటీలో లా డిపార్ట్‌మెంట్ లేదన్నారు. పరీక్ష ఫలితాల శాతం కూడా దారుణంగా ఉంటోందన్నారు. కనీసం 20 శాతం కూడా దాటడం లేదు అన్నారు. అకడమిక్ సంవత్సరం కూడా సరిగ్గా లేదు అన్నారు. సమస్యలు పరికరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకుడు ఇనాయతుల్ల, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్ రాజ్ పాల్గొన్నారు.

దిశా పోలీస్‌స్టేషన్ డిఎస్‌పిగా రమాకాంత్

ప్రజాశక్తి - కడప అర్బన్



దిశా పోలీస్‌స్టేషన్ డిఎస్‌పిగా రమాకాంత్ సోమవారం బాధ్యతల స్వీకరించారు. ఉమ్మడి కడప జిల్లాలో పలు పోలీస్ స్టేషన్‌లలో ఆయన సిఐగా విధులు నిర్వహించారు. దిశా డిఎస్‌పిగాబాధ్యతలు స్వీకరించిన ఆయన్ను పలువురు అభినందించారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్నఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

హజ్ యాత్ర ధరలపై ఆందోళన వద్దు

-ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

ప్రజాశక్తి - కడప

హజ్ యాత్ర ధరలపై ముస్లిం మైనారిటీ సోదరులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా భరోసా ఇచ్చారు. సోమవారం మధ్యాహ్నం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనా మాట్లాడారు. ఒకవేళ టికెట్ ధరలు అధికమైతే రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు సిద్ధంగా ఉంది అని చెప్పారు. హజ్ యాత్ర టికెట్ ధరల తగ్గింపుపై కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ హజ్ కమిటీతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. హజ్ యాత్రపై టిడిపి నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారన్నారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజం, వైసీపీ నాయకులు సుభాన్‌బాష, షఫీ, అజ్మతుల్లా పాల్గొన్నారు.

నృత్య, సంగీత కోర్సుల్లో ప్రవేశాల గడువు పొడిగింపు


కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం లో కూచిపూడి నృత్యం, కర్నాటక సంగీతం, కీబోర్డ్ సర్టిఫికెట్ కోర్సులలో ప్రవేశాల కోసం దరఖాస్తు గడువును ఈనెల 8 నుంచి 18వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు వైవీయూ ప్రవేశాల సంచాలకులు ఆచార్య కంకణాల గంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు.కోర్సులకు సంబంధించిన వివరాలకు www.yogivemanauniversity.ac.in లో కానీ 9032595101 నంబర్ కి ఫోన్ చేసి సంప్రదించాలని పేర్కొన్నారు.10 సంవత్సరాలు నిండిన వారు ఎవరైనా ఈ కోర్సులలో చేరడానికి అర్హులు అని తెలిపారు. తరగతులు నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి : ఎస్‌పి

కడప అర్బన్ : జిల్లాలో బాధితులు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఎస్‌పి .అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. బాధితులతో స్వయంగా ముఖాముఖి మాట్లాడి, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

'పది'లో రాజేష్ నందన్ ప్రతిభ

ప్రజాశక్తి - కడప



2022 - 23 సంవత్సరానికి గాను ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో కడప నగరం ఎర్రముక్కపల్లిలో గల బాలవికాస్ స్కూల్ విద్యార్థి ఏ రాజేష్ నందన్ మంచి ప్రతిభ కనబరచి 600 మార్కులకు గాను 586 మార్కులు సాధించి స్కూల్‌లో మూడవ స్థానంలో నిలిచాడు. తన కుమారుడు రాజేష్ నందన్ పదవ తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించి బాలవికా స్కూల్లో మూడవ స్థానంలో నిలవడం పట్ల తల్లిదండ్రులు ఏ. కిరణ్ ప్రసాద్ బాబు ఏ. శ్వేత సంతోషం వ్యక్తం చేశారు. తమ పాఠశాల విద్యార్థి మార్కులు సాధించడం పట్ల స్కూల్ డైరెక్టర్ గంగయ్య, స్కూల్ కరస్పాండెంట్ సుబ్బరాయుడు అభినందనలు తెలిపారు.


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

పేదల అభ్యున్నతే వైసిపి ధ్యేయం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పేదల అభ్యున్నతే వైసిపి ధ్యేయమని జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మేకల బాలయ్యపల్లి గ్రామంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడపకు తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి తిమ్మారెడ్డి బాలయ్య, ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

వ్యర్థాలతో నిండిన కెసి కాలువ

ప్రజాశక్తి - దువ్వూరు


కాలువలో ఉన్న వ్యర్థాలు

కెసి కాలువకు నీటి సరఫరాను అధికారులు నిలిపివేయడంతో కాలువలో చెత్త చెదారం చేరి దుర్వాసన వస్తోంది. కుందూ నది నుంచి కాలువలోకి నీరు ప్రవేశించకుండా నీరు నిలుపుదల చేశారు. వేసవిలో కాలువలో ఉపాధి హామీ ద్వారా పనులు చేపట్టి, చెత్తాచెదారం, పిచిమొక్కలను తొలగిస్తే కాలువలో నీటి ప్రవాహానికి అడ్డు ఉండదని రైతులు సూచిస్తున్నారు. ఆ మేరకు సంబంధిత అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

రేపు ఆర్‌టిసి ప్రాంగణంలోని చెట్లకు వేలం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఈ నెల 10న ఆర్‌టిసి డిపో ప్రాంగణంలోని 25 చెట్లకు సంబంధించి వేలం వేస్తున్నట్లు డిపో మేనేజర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ చెట్లను కొట్టుకొని తీసుకొని పోవుటకు వేలం వేయాలని ప్రతిపాదించామన్నారు. ప్రొద్దుటూరు పరిసర ప్రాంతాల కలప వ్యాపారులు, ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.


అరటి పంట సాగు

అరటి సాగుపై రైతుల్లో ఆసక్తి

- నియోజకవర్గంలో 6480 హెక్టార్లలో సాగు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల నియోజకవర్గంలో అరటి పంట సాగుపై రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. నియోజకవర్గంలో 6480 హెక్టార్లలో అరటి సాగు చేయగా, అత్యధికంగా లింగాల మండలంలో 3640 హెక్టార్లలో సాగైంది. ఏప్రిల్ 20 నుంచి నుంచి మే 10లోపు ఎక్కువగా అరటి మొక్కలు నాటుతారు. నియోజకవర్గంలో రెండు కోట్ల మొక్కలు నాటినట్లు ఉద్యాన అధికారులు చెబుతున్నారు. చిత్రావతి రిజర్వాయర్లో నీటి సామర్థ్యం పూర్తిగా ఉండడం వల్ల లింగాల కుడికాలువకు నీరు పుష్కలంగా విడుదల చేశారు. దీంతో ఇక నీటి సమస్య రాదనే ఉద్దేశంతో రైతులు అరటి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. నాలుగేళ్లుగా ప్రభుత్వ రాయితీ ద్వారా డ్రిప్ పరికరాలు రాకపోవడంతో పంట విస్తీర్ణం గతంలో తగ్గిందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రాయితీతో డ్రిప్ పరికరాలు సరఫరా చేస్తున్నందున అరటిసాగు విస్తీర్ణం పెరగడానికి కారణంగా చెప్పవచ్చు. అలాగే వర్షాలు వచ్చి ఎండలు తగ్గడం కూడా ఈ పంట సాగు పెరిగిందని చేసేందుకు వీలుగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఎండల నుంచి అరటి మొక్కలను రక్షించడానికి ఈత ఆకులు, పందులు, జింకల నుంచి రక్షణకు పొలం చుట్టూ చీరలను మొక్కలకు రక్షణగా రైతులు ఏర్పాటు చేశారు. రైతులు పంట చేతికందేవరకు తొమ్మిది నెలల కాలం పడుతుంది. ఈ ఏడాది మాదిరిగానే ధరలు ఉంటే మంచి లాభాలు వస్తాయని రైతులు ఆశిస్తున్నారు.

విత్తన పసుపు నిల్వకు చర్యలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని రైతులు విత్తన నిల్వకు చర్యలు చేపడుతున్నారు. మండల వ్యాప్తంగా సాగుచేసిన పసుపును రైతులు నూర్పిడి చేశారు. అధిక భాగం రైతులు పసుపును ఉడికించి వట్టి పసుపుగా మార్చి అమ్మకాలు చేపడుతున్నారు. ప్రస్తుతం పసుపు ధర రూ.6వేలు ఉంది. అయితే రైతులు వచ్చే ఏడాది పసుపు సాగు చేసేందుకు ఉన్న ఆసక్తితో విత్తన పసుపును సేకరించి నిల్వ ఉంచుతున్నారు. చల్లని ప్రదేశాలు, చెట్ల కింద పసుపు ఉంచి మండే కడుతున్నారు. వట్టి పసుపు సిద్ధం చేసిన రైతులు కొంతమంది అమ్మకాలు చేస్తుండగా, మరికొంతమంది విత్తనానికి నిల్వ ఉంచుతున్నారు. నాగులపల్లె వద్దనున్న ఎస్‌డబ్ల్యుసి గోడౌన్లలో వట్టి పసుపును నిల్వ ఉంచుతున్నారు. మహారాష్ట్ర సాంగ్లీ మార్కెట్‌కు వట్టి పసుపును అమ్మకానికి తరలిస్తున్నారు. కొంత మంది రైతులు ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తుందని ప్రకటించడంతో ఆర్‌బికెల ద్వారా అమ్మకాలు చేపట్టేందుకు ఎదురు చూస్తున్నారు. అల్లాడుపల్లె, చాపాడు, సీతారామపురం, లక్ష్మీపేట, చిన్నగురువలూరు, సిద్ధారెడ్డిపల్లె గ్రామాల వద్ద నిల్వ ఉంచుతున్నారు.


సీతారామాపురం వద్ద విత్తన పసుపును చెట్ల కింద నిల్వ ఉంచుతున్న రైతులు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - దువ్వూరు

స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులోని పాశం ఎస్టేట్ సమీపంలో జిల్లెళ్ల గ్రామానికి చెందిన ఉప్పలపాటి శేఖర్ (56) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ రాఘవేంద్రారెడ్డి తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని సుందరయ్య నగర్‌కు చెందిన ముత్తన వేణుగోపాల్ (27) అనే యువకుడు సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. వేణుగోపాల్ మద్యానికి బానిస కావడంతో భరించలేని తన భార్య పుట్టింటికి వెళ్లిపోయిందనే మనస్తాపంతో ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. మృతుని తండ్రి కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మంచినీటి పథకాలకు మోక్షమెన్నడో..!

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని 22 గ్రామపంచాయతీలకుగాను 63 గ్రామాలు ఉన్నాయి. వీటిలో 43 గ్రామాల్లో మాత్రమే ఉపరితల జలాశయాలు అందుబాటులో ఉన్నాయి. మిగిలిన 21 గ్రామాల్లో బోర్లు మాత్రమే ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో బోర్లు మాత్రమే అందుబాటులో ఉండడంతో విద్యుత్ సరఫరా ఉన్న సమయంలో మాత్రమే నీటి సరఫరా ఉంటుంది. వేసవి ప్రారంభం కావడంతో తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉపరితల జలాశయాలు ఉంటే విద్యుత్ సరఫరా ఉన్న సమయంలో వాటిని నింపుకొని అవసరమైన సమయంలో నీటిని వాడుకొనే అవకాశం ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు. విద్యుత్ ఉన్న సమయంలో పూర్తిగా మోటర్లు ఆడుతున్నాయని, తద్వారా అధిక కరెంటు బిల్లులు గ్రామపంచాయతీకి వస్తున్నట్లు తెలుస్తోంది. చిన్న వరదాయపల్లె, వెంగన్నగారి పల్లె, బసిరెడ్డి పల్లె, చియ్యపాడు బిసి కాలనీ, సోమాపురంలోని శ్రీరాంనగర్, నాగాయపల్లె, రాజోలు, విది కొట్టాలు, విజయనగరం, తిమ్మాయపల్లె, వెదురూరు ఎస్‌సి కాలనీ, ఎస్.ఒబాయపల్లె, తూర్పు అనంతపురం గ్రామాల్లో ఉపరితల జలాశయాలు నిర్మించాల్సి ఉంది. ఖాదర్‌పల్లెలో గతంలో ఏర్పాటు చేసిన ఉపరితల జలాశయం నీరు సరిపోవడం లేదని అదనపు మరోకటి నిర్మించేందుకు వస్తున్నాయి. చాపాడులో కూడా గతంలో నిర్మించిన ట్యాంకు నీరు సరిపోకపోవడంతో మరొక ట్యాంకును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఉపరితల జలాశయాలు ఉన్నప్పటికీ నీటిని నేరుగా సరఫరా చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. మంచినీటి పథకాలను ప్రతి వారం శుభ్రం చేస్తూ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. ట్యాంకులు లేని గ్రామాల్లో జనాభాను ఆధారం చేసుకుని 10వేలు, 20వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకులు ఏర్పాటు చేస్తే ప్రజలకు వేసవిలో ఎలాంటి తాగునీటి సమస్య ఏర్పడకుండా ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు.


చాపాడులో అదనపు ట్యాంక్ నిర్మాణం చేపట్టకుండా పైప్‌లైన్ ఏర్పాటు

వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి


మాట్లాడుతున్న కౌన్సిలర్లు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడేది నేర్చుకోవాలని, ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి మీకు లేదని పులివెందుల పురపాలక కౌన్సిలర్లు పార్నపల్లి కిషోర్, మూలి మహేశ్వర్‌రెడ్డి, కో-ఆప్షన్ దాసరి చంద్రమౌళి, వైసిపి నాయకుడు రాజేష్ నాయుడు పేర్కొన్నారు. ఆ మేరకు సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో చెప్పిన విధంగానే 98 శాతం హామీలు నెరవేర్చారన్నారు. ప్రభుత్వ పాలనలో మీకు మంచి జరిగింది అనిపిస్తేనే ఓటు వేయండి అని చెప్పిన దమ్మున్న ముఖ్యమంత్రి దేశ చరిత్రలోనే వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. వేంపల్లిలో వార్డు సభ్యులుగా కూడా గెలవలేని మీరు ఈ స్థాయిలో ఉన్నారంటే అది వైఎస్ చలువతోనే అని అన్నారు. వివేక హత్య కేసు సిబిఐ పరిధిలో ఉందన్నారు. సోనియాగాంధీ అనాలోచిత నిర్ణయం వల్లనే రాష్ట్రం ముక్కలై పోయిందన్నారు. ఆనాడే జగన్మోహన్‌రెడ్డికి ముఖ్యమంత్రి పదవి ఇచ్చి ఉంటే రాష్ట్రం విడిపోయేది కాదన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులు కనిపించలేదా అని వారు ప్రశ్నించారు. వేంపల్లి నుండి పులివెందులకు వచ్చేటప్పుడు బెస్తవారిపల్లె సమీపంలో కడుతున్న మెడికల్ కాలేజీ పనులను మీరు చూడలేదా అని వారు ప్రశ్నించారు. చౌకబారు మాటలు మానుకొని అభివృద్ధి పనులకు సహకరించాలని వారు హితవు పలికారు.

పుస్తక పఠనంతో మంచి గుర్తింపు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

విద్యార్థులు పుస్తకాన్ని తలవంచుకొని చదివితే, అది మనలను తల ఎత్తుకొనేలా చేస్తుందని రచయిత డికె చదువులబాబు అన్నారు. సోమవారం పుట్టపర్తి నారాయణ చార్యుల ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమంన్ని గ్రంథాలయ అధికారి టి.తిరుపతమ్మ అధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅథిథులుగా జింక సుబ్రహ్మణ్యం, మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ సావిత్రమ్మ, కవి రచయిత చదువుల బాబు, జన విజ్ఞాన వేదిక కన్వీనర్ చంద్రశేఖర్, దొరసానిపల్లె స్కూల్ గణిత ఉపాధ్యాయుడు సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పితామహుడు గ్రంథాలయ స్థాపనకు కృషి చేసిన శ్రీ అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. క్రాఫ్ట్ టీచర్ చంద్రకళ, ఉపాధ్యాయురాలు వరలక్ష్మి, స్పోకెన్ ఇంగ్లీష్ రిసోర్స్ పర్సన్స్ శ్రీకాం త్, గ్రంథాలయ సిబ్బంది, హెల్పర్ గంగదేవి, తల్లిదండ్రులు, పాఠకులు పాల్గొన్నారు. **చాపాడు :** గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగమని గ్రంథాలయ శాఖ అధికారి శివశంకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం వేసవి శిక్షణా శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖ గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 11 వరకు వేసవి శిక్షణ శిబిరం ఉంటుందన్నారు. అనంతరం పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది చంద్ర, అఫ్రిన్, నక్కలదిన్నె బిడిసి రవిశంకర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** పట్టణ పరిధిలోని గ్రంథాలయంలో సోమవారం సమ్మర్ క్యాంప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ రికార్డ్ అసిస్టెంట్ ఉమాదేవి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పిల్లలు పూర్తిగా ఆటపాటలతో సమయాన్ని వృథా చేయకుండా విజ్ఞానాన్ని పెంపొందించుకొనుటకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారికోసం అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచారు. **జమ్మలమడుగు :** విద్యార్థులు వేసవి సెలవుల్లో పుస్తక పఠనం అలవర్చుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి జింకా చంద్రశేఖర్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బండారు శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు కోరారు. శాఖ గ్రంథాలయంలో సోమవారం జింకా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని వారు ప్రారంభించారు. గ్రంథాలయాధికారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించి, విజేతలకు జూన్ 11న బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠకులు పాల్గొన్నారు. **ముద్దనూరు :** పిల్లలకు విజ్ఞానాన్ని, వినోదాన్ని అందించేందుకు స్థానిక గ్రంథాయంలో సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ నిర్వాహకులు రాజశేఖర్ తెలిపారు. జూన్ 12 వరకు సమ్మర్ క్యాంపు ఉంటుందన్నారు. విద్యార్థులు, పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలాని నిర్వాహకులు కోరారు.



జమ్మలమగుగు : వేసవి శిబిరంలో విద్యార్థులు

ప్రతిభతో ఉన్నత శిఖరాలు : 'పల్లేటి'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రతిభతో ఉన్నతశిఖరాలను అధిరోహించవచ్చని శ్రీరవీంద్ర విద్యాసంస్థల అధినేత పల్లేటి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పదవతరగతి పరీక్షా ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు 'ప్రతిభకు పట్టాభిషేకం' పేరుతో ఆదివారం సాయంత్రం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఫలితాల్లో 591 గరిష్ట మార్కులతో టౌన్‌ఫస్ట్, ప్రతి ఇద్దరిలో ఒక్కరికి 500 మార్కులకుపైగా సాధించడంతోపాటు వందశాతం ఫలితాలు వచ్చాయన్నారు. ఇది విద్యాసంస్థల సామర్థ్యానికి నిదర్శనమన్నారు. ఈ విజయం తొలిమెట్టుగా భావించి ఇంకా ఎన్నో విజయాలను సాధించాల్సి ఉందన్నారు. గరిష్ట మార్కులు, వందశాతం ఉత్తీర్ణత, 500కుపైగా మార్కులు ఈ మూడు విజయాలు ఒకేసారి సాధిండచంతో ఆనందానికి హద్దులు లేవన్నారు. ఈ విజయానికి కృషి చేసిన విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రోత్సహించిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. 591మార్కులు సాధించిన గీతాంజలి మాట్లాడుతూ తాను నర్సరీ నుండి పదవ తరగతి వరకు ఈ పాఠశాలలోనే చదువుకున్నందునే మంచి మార్కులు సాధించగలిగానన్నారు. తనను ప్రోత్సహించిన అమ్మ, అక్కలు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో తాను సివిల్స్ చేస్తానన్నారు. 586 మార్కులు సాధించిన లిఖిత మాట్లాడుతూ కాన్సెప్ట్ బోధన తన విజయానికి కారణమన్నారు. భవిష్యత్‌లో సిఎ చేస్తానన్నారు. విద్యార్థులు భార్గవ్‌రెడ్డి, అరవింద్, గాయత్రి, షాహిర్ మాట్లాడారు. డైరెక్టర్ విష్ణుకుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు మాట్లాడారు.



అభినందన సభలో మాట్లాడుతున్న పల్లేటి ప్రభాకర్‌రెడ్డి

వేసవి సరదా.. ఈత

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఈత కొట్టేందుకు యువత, పిల్లలు వేసవి కాలకం కోసం ఎదురుచూస్తుంటారు. ఎప్పుడెప్పుడు ఎండా కాలం వస్తుందా.. ఈతకు వెళదామా అని ఉంటారు. వేసవి కాలం వచ్చిందంటే చాలు ఇక యువత, పిల్లలకు సరదానే. వారికి అందుబాటులో ఉన్న కాలువలు చెరువులు, సంపులు, బావులు కనిపిస్తే చాలు కేరింతలు కొడతారు. ఇటీవల కాలంలో యువకులతో పాటు యువతులు కూడా ఈత కొట్టేందుకు సై అంటూ పోటీ పడుతున్నారు. సాధారణంగా ఎక్కువమంది బావులలోనే ఈత కొట్టడానికి మక్కువ చూపుతారు. అయితే కాలగమనంలో బావులు ఏనాడో అంతరించిపోయాయి. రైతులు కూడా వ్యవసాయ రంగానికి బిందు, తుంపర సేద్యాలకు అలవాటు పడడంతో బావుల సంగతి కాస్త పక్కన పెట్టారు. ఇది ఇలా ఉండగా కష్ణ జలాలు అందుబాటులో ఉండడంతో వంకలు, వాగులు, చెరువులో నీరు కనిపిస్తోంది. వీటిల్లో ఈత కొడుతున్నారు. ఈత నేర్చుకునేందుకు బావుల్లో అయితే భయపడేవారు. ప్రస్తుతం కాలువలు, వంకలు, చెరువులే కాబట్టి పిల్లలు కూడా అక్కడే ఈత నేర్చుకుంటున్నారు. వేసవి కాలం ముగిసే వరకు ఈత రాని చిన్నారుల పట్ల పెద్దలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


కాలువలో ఈత కొడుతున్న చిన్నారులు

గోపిరెడ్డి గురివిరెడ్డికి అభినందనలు

ప్రజాశక్తి - దువ్వూరు

మైదుకూరు మండలం ఉత్సలవరం గ్రామానికి చెందిన బేతంచర్ల చిన్న సంజమ్మ దువ్వూరు మండలం చిన్న సింగనపల్లె గ్రామంలో వివాహానికి వచ్చి, మళ్లీ స్వగ్రామానికి వెళుతుండగా గుడిపాడు గ్రామ సమీపంలో తన విలువైన బంగారు ఆభరణాలు, పర్సు పోగొట్టు కుంది. చిన్న సంజనమ్మ తన బంగారు, పర్సు గురించి ఎంత వెతికినా ఆచూకీ తెలియలేదు. ఈ నేపథ్యంలో గుడిపాడు గ్రామానికి చెందిన గోపిరెడ్డి గురివిరెడ్డి తన పని మీద పోతుండగా.. అతనికి బంగారు, పర్సు దొరికింది. వీటిని ఆయన మానవత్వంతో, నిజాయితీగా దువ్వూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రాఘవేంద్రారెడ్డికి అందజేశారు. నిజాయితీగా వ్యవహరించిన గురివిరెడ్డిని ఎస్ఐ, పోలీసులు, గుడిపాడు సర్పంచు మహబూబ్ షరీఫ్ అభినందించారు. బంగారు, పర్సు బాధితురాలు సంజనమ్మకు ఎస్ఐ, గురి విరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె వారికి కృతజ్ఞతలు తెలిపారు.




పోగొట్టుకున్న సొమ్మును సంజనమ్మ అందిస్తున్న ఎస్ఐ

పాదయాత్రలో లోకేష్‌ను కలిసిన నాయకులు

ప్రజాశక్తి - ఖాజీపేట

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌బాబు చేపట్టిన యువగళం పాదయాత్ర కర్నూలు జిల్లాలో కొనసాగుతోంది. ఈ సందర్భంగా మండలానికి చెందిన టిడిపి నాయకులు పలువురు సోమవారం ఆయనను కలిసి పాదయాత్రలో సంఘీభావం తెలిపారు. బిసి దాసరి సాధికార సమితి కడప పార్లమెంట్ కన్వీనర్ గోవింద్ సుబ్బయ్య, టిడిపి మండల యువ నాయకులు, రావులపల్లె పదవ వార్డు ప్రతినిధి తుట్టే రాము యాదవ్, దాసరి దిలీప్‌తేజ పాల్గొన్నారు.


వినతిపత్రాన్నిస్తున్న విభిన్నప్రతిభావంతులు

పింఛన్ రూ.10 వేలు పెంచి ఆదుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

విభిన్న ప్రతిభావంతులకు పింఛన్ రూ.10 వేలు పెంచి ఆదుకోవాలని ఆల్‌ఆఫ్‌యు విభిన్న ప్రతిభావంతుల సేవా సొసైటీ రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్, చలప తిరావు, కాజా మొహిద్దీన్ కోరారు. స్థానిక తహశీల్దార్ నజీర్ అహమ్మద్‌కు వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ అం దరూ ఆటపాటలతో ఆహ్లా దకంగా చదువు సాగిస్తే విభిన్న ప్రతిభా వంతులు మాత్రం ఒంటరిగా వైకల్యంతో బాధపడుతుంటారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌పైనే వీరు ఆధారపడి ఉన్నారన్నారు. విభిన్న ప్రతిభావంతుల వాలంటీర్ బావమ్మ, సంజీవ్‌కుమార్, మహేష్‌కుమార్ పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజలు

బస్టాండ్ నిర్మించాలని వినతి

ప్రజాశక్తి - దువ్వూరు

మండల కేంద్రమైన దువ్వూరులో నిరుపయోగంగా ఉన్న పోలీస్ క్వార్టర్స్ స్థలంలో బస్టాండ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆ మేరకు సోమవారం వారు స్పందన కార్యక్ర మంలో తహశీల్దార్ రమకు మారికి వినతి పత్ర మిచ్చారు. బస్టాండ్‌లేక ప్రయాణికులు రోడ్డు కిరువైపులా గంటలకొద్దీ ఎండ, వాన వంటి పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. దుమ్ముతో మహిళలు, విద్యార్థులు, వృద్ధులు, రోగులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని విన్నవించారు. కనీస అవసరాల నిమిత్తం మరుగుదొడ్డి, మూత్ర విసర్జనకు కూడా అవకాశం లేదని తెలిపారు. ప్రజ ప్రయోజనాల కోసం ఆర్‌టిసి బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని కోరరు.

నేడు చాపాడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - చాపాడు

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభాభవనంలో మంగళవారం మండల సర్వ సభ్య సమావేశం ఎంపిపి టి.లక్షుమయ్య అధ్యక్షతలన జరుగుతుందని ఎంపిడిఒ శ్రీధర్‌నాయుడు తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి హాజరవుతారన్నారు. మండలస్థాయి అధికారులు తమ నివేదికలతో, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే సభ దృష్టికి తేవాలన్నారు.


12న ముద్దనూరు ..

ముద్దనూరు : ఈనెల 12న స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో ఎంపిపి ప్రదీప్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సోమవారం ఎంపిడిఒ రమణారెడ్డి తెలిపారు. సమావేశంలో పలు అంశాలపై చర్చిస్తామన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల మండల అధికారులు తప్పక హాజరు కావాలని ఎంపిడిఒ కోరారు.

చేయూత.. మనందరి బాధ్యత

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

విభిన్న ప్రతిభావంతులకు చేయూతనుందించడమే మన అందరి బాధ్యత అని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తల్లం ప్రభాకర్ తెలిపారు. పట్టణంలోని ప్రముఖ సేల్స్ టాక్స్ ఆడిటర్ వంకధార నాగేశ్వంరావు మాతృమూర్తి వంకధార భాగ్యమ్మ వర్ధంతిని పుర స్కరించుకుని, నాగేశ్వరరావు కుమార్తె నిత్యశ్రీ బియ్యం, నిత్యవసర సరుకులను 30 మంది విభిన్నప్రతిభావంతుల కుటుంబాలకు వితరణ చేశారు. సహాయ సహకారాలు అందించిన వంకదార కుటుంబ సభ్యులకు విభిన్నప్రతిభావంతుల నెట్‌వర్క్ అధ్యక్షులు రఘునాథరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సేల్స్ టాక్స్ ఆడి టర్ నాగేశ్వరరావు, లింగాల మండల విభిన్నప్రతిభావంతుల సమాఖ్య కార్యదర్శి తమటం చంద్రఓబులరెడ్డి, సభ్యులు సునీల్, ప్రసాద్, రాజు పాల్గొన్నారు.


సరుకులు పంపిణీ చేస్తున్న వంకదార కుటుంబ సభ్యులు

జీవితాంతం అన్నదానం కొనసాగిస్తా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

తన జీవితాంతం అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కనున్న మున్సిపల్ పెట్రోల్ బంక్ పక్కన 'రాజన్న భోజనం' పేరుతో ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజు మధ్యాహ్నం 12.30గంటల నుంచి 2.30గంటల వరకు భోజనం పెడతామన్నారు. అన్నార్థులను గుర్తించి మొబైల్ భోజనాన్ని కూడా ఉచితంగా అందజేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అధికారంలోనికి వచ్చినప్పటి నుండి ఒకవైపు అభివృద్ధి కార్యక్రమాలు, మరోవైపు సంక్షేమ కార్యక్రమాలు నిత్యం చేస్తూనే ఉన్నామన్నారు. అవసరార్థం తన ఇంటివద్దకు వచ్చిన వారికి ఉన్నంతలో ఆదుకుంటూనే ఉన్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి

రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి : ఎఒ

ఖాజీపేట : ఖరీఫ్ సీజన్ ప్రారంభం దృష్ట్యా రైతు భరోసా కేంద్రాల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు తమ పేర్లను నమోదు చేసు కోవాలని ఎఒ నాగార్జున సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఆయా ఆర్‌బికెల్లో తమ ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్‌తో సిబ్బంది వద్ద పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఒక రైతుకు 5 ఎకరాల వరకు ఇస్తా రని, 10కిలోల జీలుగల ధర రాయితీపోనూ రూ.395, జనములు రూ.420 చెల్లించాల్సి ఉంటుందన్నారు. పిల్లపెసర విత్తనాలు రూ.485 అంద జేయనున్నట్లు వివరించారు.